విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలని వినతి


యూజీసీ కార్యదర్శికి వినతిపత్రాన్ని అందిస్తున్న ఏబీవీపీ నాయకులు

రాయదుర్గం: విద్యార్థుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ యూనివర్శిటీ గ్రాంట్స్ కమిషన్ (యూజీసీ) కార్యదర్శి ప్రొఫెసర్ మనీష్ ఆర్ జోషికి హెచ్‌సీయూ అఖిలభారత విద్యార్థి పరిషత్ నాయకుల బృందం ఒక వినతిపత్రాన్ని అందించారు. విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలను ఆయనకు వివరించారు. గత జేఆర్‌ఎఫ్ స్కోర్స్‌ను ప్రస్తుత సంవత్సరం అడ్మిషన్లకు తీసుకొని అవకాశం కల్పించేలా చూడాలని వారు సూచించారు. హెచ్‌సీయూలో చాలా మంది విద్యార్థులు ఈ పరిస్థితిని ఎదుర్కొంటున్నారని వారు ఆయన వివరించారు. మరింత ఎక్కువ మందికి అవకాశాలు కల్పించాల్సిన తరుణంలో నిబంధనల పేరిట పక్కన పెట్టడం సరికాదని, ఈవిషయంలో విద్యార్థులకు న్యాయం జరిగేలా చూడాలని వారు కోరారు. అలాగే ప్రతి యూనివర్శిటీలో ఉన్న సమస్యలను కూడా వారు వివరించి వాటిపై దృష్టి సారించాలని వారు కోరగా ఈ విషయం పరిశీలించి తగిన న్యాయం జరిగేలా చూస్తామని ఆయన హామీ ఇచ్చినట్లు ఏబీవీపీ నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏబీవీపీ హెచ్‌సీయూ అధ్యక్షుడు బాలకృష్ణ, కార్యదర్శి సాక్షి, ఎస్ఈసీ ఆయేషా తదితరులు పాల్గొన్నారు.

'విద్యాంజలి'లో ఉత్సాహంగా కిడ్స్ కార్నివాల్


సాంస్కృతిక కార్యక్రమాల్లో విద్యార్థులు

శేరిలింగంపల్లి: శేరిలింగంపల్లి డోయన్స్ కాలనీ విద్యాంజలి స్కూల్‌లో కిడ్స్ కార్నివాల్‌ను ఉత్సాహంగా శుక్రవారం రాత్రి నిర్వహించారు. కిడ్స్ కార్నివాల్ చిన్నారుల సాంస్కృతిక కార్యక్రమాలతో స్కూల్ ప్రాంగణం మారుమోగింది. వక్రతుండ అనే శాస్త్రీయ నృత్యంతో కార్యక్రమాలను ప్రారంభించారు. యూకేజీ చిన్నారుల అమ్మ జోల పాట అందరినీ ఆకట్టుకోగా, నానాటికీ కనుమరుగవుతున్న నాటక రంగ ప్రాధాన్యతను కాపాడేందుకు 1, 2వ తరగతులు చదివే విద్యార్థులచే 'శశిరేఖా పరిణయం' (మాయాబజార్) తల్లిదండ్రులను ఆకట్టుకుంది. 2వ తరగతి విద్యార్థులచే హనుమాన్ నృత్యం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. భారత్ వికాస్ పరిషత్ నమో గంగా ఆధ్వర్యంలో గురువందనం కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా చిల్డ్రన్స్ డాక్టర్ అర్జున రాజ్‌కుమార్, అతిథిగా కరస్పాండెంట్ ఎల్.నర్సింహారెడ్డి, అడ్వైజర్‌గా మమతారెడ్డి హాజరై గత ఏడాది అకడమిక్స్ సత్తా చాటిన వారికి సర్టిఫికెట్లు, మెడల్స్ అందజేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ బాలాత్రిపురసుందరి తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న 'అంబిటస్ కిండర్ వరల్డ్' క్రీడా వార్షికోత్సవం


క్రీడా వార్షికోత్సవంలో చిన్నారులు

రాయదుర్గం: గచ్చిబౌలిలోని అంబిటస్ కిండర్ వరల్డ్ స్కూల్ క్రీడా వార్షికోత్సవాన్ని ఆదివారం అట్టహాసంగా నిర్వహించారు. ఈ క్రీడోత్సవాన్ని 'అంబిలీప్' పేరిట జరిపారు. కెంబ్రిడ్జ్ ఎర్లీ లెర్నింగ్ సెంటర్ చిన్నారుల కోసం ప్రత్యేకంగా నిర్వహించిన ఈ కార్యక్రమంలో పిల్లల కినెస్టెటిక్ స్కిల్, సమన్వయం, సహకారం, క్రీడాస్ఫూర్తి అందరినీ విశేషంగా ఆకట్టుకుంది. ముఖ్య అతిథిగా విచ్చేసిన రోలర్ స్కేటింగ్ చాంపియన్ కావ్యషా మాట్లాడుతూ... పిల్లలకు చదువుతోపాటు వారికి నచ్చిన క్రీడలలో రాణించేలా ప్రోత్సహిస్తే ఉజ్వల భవిష్యత్ సాకారం అవుతుందన్నారు. స్టార్‌లైట్ వెల్నెస్ సెంటర్ వ్యవస్థాపకురాలు అన్జలిడాంగే మాట్లాడుతూ... చిన్నారుల పోషణ, సంపూర్ణ ఆరోగ్యంపై తల్లదండ్రులు ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. అనంతరం చిన్నారులు చేసిన జిమ్నాస్టిక్స్, ఇతర క్రీడా కసరత్తులు, థీమ్ ఆధారిత పరికరాలతో నిర్వహించిన రేసులు అందరినీ ఆకట్టుకున్నాయి, అనంతరం ఈ ఉత్సవంలో పాల్గొన్న చిన్నారులందరికీ సర్టిఫికెట్లు, మెడల్స్‌ను అందించారు. ప్రిన్సిపాల్స్ సంగీత, సుజాత ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, చిన్నారులు పాల్గొన్నారు.

నృత్యం.. నేత్రపర్వం

శిల్పారామంలో ఆకట్టుకున్న సాంస్కృతిక కార్యక్రమాలు

మాదాపూర్: కళాకారులు తమ కర్ణాటక గాత్ర కచేరీ, కూచిపూడి నృత్య ప్రదర్శనతో సందర్శకులను అలరించారు. మాదాపూర్‌లోని శిల్పారామంలో నిర్వహిస్తున్న వారాంతపు సాంస్కృతిక కార్యక్రమాలలో భాగంగా ఆదివారం శ్రీనిధి గాత్ర కచేరీలో భాగంగా భజమానస, రామతిరుమల దాసు కీర్తన, స్వాతి తిరుణాల్ కీర్తనలు ఆలపించారు. మృదంగం విజయలక్ష్మి, వయోలిన్ కౌండిన్య పన్నాల సంగీత సహకారాన్ని అందించారు. గురువు జ్యోతిరెడ్డి శిష్యబృందంచే కూచిపూడి నృత్య ప్రదర్శనతో అలరించారు. ఇందులో దశరస గణపతిం, శ్లోకమాల, పుష్పాంజలి, శృంగారలహరి, సూర్యాష్టకం, భామాకలాపం, శివపంచాక్షరీ, కృష్ణశబ్దం, నారాయణ తీర్థుల తరంగం తదితర అంశాలను మిషిక, శ్రీతావి, చిన్మయి, దేవాంశ, జశ్విత, ఐశ్వర్య, సాహితి, వర్మ, తరిష్య, వైష్ణోదేవి, సహస్ర పాల్గొని ప్రదర్శించారు.



మాదాపూర్‌లోని శిల్పారామంలో అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు

కార్మిక సమస్యలపై నిరంతరం పోరాటం

సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షుడు చుక్క రాములు


సమావేశంలో మాట్లాడుతున్న రాములు

పటాన్‌చెరు టౌన్: కార్మిక సమస్యలపై సీఐటీయూ నిరంతరం పోరాటాలు చేస్తున్నట్లు సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షుడు చుక్కారాములు పేర్కొన్నారు. ఆదివారం పట్టణంలోని ఐలా భవన్ లో జరిగిన కిర్బి కార్మికుల జనరల్ బాడీ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన మాట్లాడారు. కార్మికుల సమస్యల పైన నిరంతరం పోరాడుతున్న సంఘం సీఐటీయూ అని అన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మికుల సమస్యలు పరిష్కరించడంలో పూర్తిగా విఫలమైందని ఆరోపించారు. సమస్యల పరిష్కారానికి కార్మికులంతా ఐక్యంగా ఉద్యమించి, సమస్యలు పరిష్కారం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ రాష్ట్ర కమిటీ సభ్యులు రాజయ్య, జిల్లా ఉపాధ్యక్షుడు పాండురంగారెడ్డి, యూనియన్ నాయకులు వీఎస్ రాజు, నాగప్రసాద్, ఏడుకొండలు, లఖాన్, లక్ష్మణ్, వెంకట్, జైపాల్ ,మహేశ్వర్ రెడ్డి, మల్లేశం పాల్గొన్నారు.

'వేవ్‌రాక్' బస్టాండ్...
సాధ్యమేనా?


నానక్‌రాంగూడ ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్ ప్రాంతంలోని వేవ్‌రాక్ ముందు ఆగిన బస్సులు

కొండాపూర్, లింగంపల్లి కన్నా 'వేవ్‌రాక్' వద్ద ఎక్కువ బస్సుల రాకపోకలు

- ఖాళీ స్థలంలోనే ఆగుతున్న ఆర్టీసీ బస్సులు
- అత్యంత ప్రాధాన్యత కలిగిన ప్రాంతమైనా బస్టాండ్ నిర్మాణంపై జాప్యం

రాయదుర్గం: అది ఎంతో ప్రాధాన్యత కలిగిన ప్రాంతం. అందునా వందలాది ఆర్టీసీ బస్సులు నిత్యం రాకపోకలు సాగిస్తాయి. ఎంతో ప్రాధాన్యత సంతరించుకున్న ప్రపంచంలోనే అత్యంత పేరెన్నికన్న ఐటీ, ఆర్థిక, ఇతర సంస్థలకు కేంద్రమైన నానక్‌రాంగూడలోని ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్ ప్రాంతం. ఇందులో లాస్ట్ స్టాప్‌గా పిలిచేదే వేవ్‌రాక్ సంస్థ భవనాల ముందు, అమెజాన్ సంస్థ చేరువలో అనధికార బస్టాండ్ ఖాళీ స్థలంలో కొనసాగుతోంది.

- ఇక్కడికి నగరం నలుమూలల నుంచి ఆర్టీసీ సంస్థ అనేక రకాల బస్సులు అంటే ఆర్డినరీ, సిటీ ఎక్స్‌ప్రెస్, ఏసీ బస్సులను సైతం ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్ ప్రాంతంలోని వేవ్‌రాక్ వరకు నడుపుతోంది. ఈ నేపథ్యంలో అక్కడ ఆర్టీసీ బస్టాండ్ ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉంది.
- అయినా ఆర్టీసీ అధికారులు, టీజీఎస్ఐఐసీ అధికారులు కానీ ఎలాంటి చర్య లు తీసుకోకపోవడం విడ్డూరం. ఆర్టీసీ అధికారులు బస్సులు నడపడంపై, ఐటీ, ఇతర ఉద్యోగులకు రవాణా సౌకర్యాల కల్పనపై టీజీఎస్ఐఐసీ దృష్టి పెడుతున్నాయి. తప్ప ఆర్టీసీ బస్సులు వందలాదిగా వస్తుంటే బస్టాండు ఏర్పాటు చేయాలనే ఆలోచన ఇప్పిటికీ చేయకపోవడం విడ్డూరం. ఇప్పటికైనా అధికారులు స్పందించి వెంటనే అందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని పలువరు కోరుతున్నారు.
- శేరిలింగంపల్లి నియోజకవర్గంలో అత్యధిక బస్సులు రాకపోకలు నిర్వహించేంది కూడా ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్ ప్రాంతంలోని వేవ్‌రాక్ నుంచే. ఇక్కడికి నగరం నలుమూలల నుంచి అంటే ఉప్పల్, సికింద్రాబాద్, దిల్‌సుఖ్‌నగర్, మెహిదీపట్నం, కోఠి, కూకట్‌పల్లి, బాచుపల్లి, లింగంపల్లి, పటాన్‌చెరు, బాలానగర్ సహా పలు ప్రాంతాల నుంచి ఆర్టీసీ సంస్థ ఐటీ, ఇతర ఉద్యోగుల కోసం బస్సులను నడుపుతోంది. మొదట్లో ఆర్టీసీ ఆర్డినరీ, ఎక్స్‌ప్రెస్, మెట్రో ఎక్స్‌ప్రెస్ బస్సులే నడిచేవి. ఆతర్వాత ఏసీ బస్సులను కూడా నడిపిస్తోంది. దీంతో బస్సులలో రాకపోకలు విపరీతంగా పెరిగిపోయింది.
- దీంతోనే పెద్ద సంఖ్యలో బస్సుల ట్రిప్పులను పెంచుతూ పోతున్నారు. ఇంత జరుగుతున్నా కానీ ఆర్టీసీ బస్టాండ్ నిర్మాణం చేయకపోవడం విడ్డూరం.

ప్రయాణికులు చెట్ల కింద నిలవాల్సిందే..

వేవ్‌రాక్ నుంచి వందలాది బస్సులు రాకపోకలు సాగిస్తున్న ప్రాంతంలో లాస్ట్ స్టాప్ కావడంతో ఇక్కడికే అంతా ఐటీ, ఇతర ఉద్యోగులు వచ్చి చెట్ల కింద వేచి ఉండి ఆర్టీసీ బస్సుల్లో రాకపోకలు సాగిస్తున్నారు. కనీసం ప్రయాణికులకు కూర్చోవడానికి కూడా ఎలాంటి సౌకర్యాలు లేకపోవడం మరో విడ్డూరం. అంతేకాకుండా ఒకచోటును ఏర్పాటు చేసుకొని అక్కడ ఆర్టీసీ అధికారులు నిల్చొని బస్సుల రాకపోకలను పర్యవేక్షిస్తూ వస్తున్నారు. ఉదయం నుంచి రాత్రి వరకు అధికారులు ఇక్కడే ఉండాల్సిన అవసరం ఉంది. వీరికి కనీస సౌకర్యాలు కూడా లేకుండా పోయినా విధులను నిర్వహించాల్సిందే. తెల్లవారుజాము నుంచి 11 గంటల వరకు ఆ తర్వాత 4 గంటల నుంచి రాత్రి వరకు బస్సుల ట్రిప్పుల సంఖ్య గణనీయంగా ఉండటంతో ఎండ, వానలో నానా ఇబ్బందులు పడాల్సిన దుస్థితి ప్రయాణికులకే కాకుండా ఆర్టీసీ అధికారులదేనని చెప్పకతప్పదు.

- నానక్‌రాంగూడలో కమ్యూనిటీ హాల్ ఏర్పాటు కోసం గతంలో స్థలాన్ని కేటాయించారు. ఆ తర్వాత ఈ స్థలం మాదేనని టీఎస్ఐఐసీ సంస్థ స్పష్టం చేయగా అందులో వాహనాల చార్జింగ్ పాయింట్, బస్టాండ్ ఏర్పాటు చేయాలని తలపెట్టగా నానక్‌రాంగూడవాసులు పెద్ద ఎత్తున నిత్య ఆందోళన కార్యక్రమాలను చేపట్టారు. దీంతో తమ ప్రతిపాదనను ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ, అప్పటి కార్పొరేటర్ కొమిరిశెట్టి సాయిబాబా జోక్యంతో టీఎస్ఐఐసీ తమ ప్రతిపాదన విరమించుకొంది. దీంతో ఈ ప్రతిపాదన అంత వరకే నిలిచిపోయింది. ఇక తప్పనిసరి పరిస్థితిలో వేవ్‌రాక్ ముందున్న ఖాళీ స్థలంలోనే బస్సులను ఆపుతూ రాకపోకలు సాగిస్తున్నారు. భవిష్యత్తులోనైనా అనువైన స్థలాన్ని కేటాయించి బస్టాండ్‌ను నిర్మాణం చేస్తే ప్రయాణికులకు ఎంతో మేలు చేకూరినట్లవుతుంది, ఆదిశగా ఆర్టీసీ, టీఎస్ఐఐసీ, జీహెచ్ఎంసీ సంయుక్తంగా తగిన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది.

నేడు మౌలానా ఆజాద్ స్మారక ఉపన్యాసం

రాయదుర్గం: జాతీయ విద్యా దినోత్సవాన్ని పురస్కరించుకొని మౌలానా ఆజాద్ జాతీయ ఉర్దూ విశ్వవిద్యాలయంలో మౌలానా ఆజాద్ స్మారక ఉపన్యాసం కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. మౌలానా అబుల్ కలామ్ ఆజాద్ జయంతి నిర్వహించాలని నిర్ణయించారు. కార్యక్రమాన్ని ఉర్దూ విశ్వవిద్యాలయం క్యాంపస్‌లోని డీడీఈ ఆడిటోరియంలో ఉదయం 10 గంటలకు నిర్వహిస్తారు. 'మనూ' వైస్‌చాన్స్‌లర్ ప్రొఫెసర్ సయ్యద్ ఐనుల్ హసన్ అధ్యక్షతన జరిగే కార్యక్రమంలో నేషనల్ కౌన్సిల్ ఆఫ్ ఎడ్యుకేషనల్ రీసెర్చ్ అండ్ ట్రెనింగ్ (ఎన్‌సీఈఆర్‌టీ) మాజీ డైరెక్టర్ పద్మశ్రీ కృష్ణకుమార్ ప్రత్యేక ఉపన్యాసం చేస్తారు. యూనివర్శిటీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఇష్తియాక్ ఆహ్మద్, పలువురు ప్రొఫెసర్లు, ఫ్యాకల్టీ, అధికారులు, విద్యార్థులు పాల్గొంటారు.

జూకల్‌ను సందర్శించిన సీపీ అవినాష్ మహంతి

శంషాబాద్ రూరల్: విగ్రహాల ధ్వంసం నేపథ్యంలో మండలంలోని జూకల్ గ్రామంలో దేవాలయాన్ని సైబరాబాద్ కమిషనర్ అవినాష్ మహంతి ఆదివారం పరిశీలించారు. గ్రామస్తులతో మాట్లాడి ఘటన వివరాలను ఆరాతీశారు. గ్రామస్తులు తొందరపడి పడకుండా శాంతి భద్రతల కోసం పోలీసులకు సహకరించాలన్నారు. ఆయన వెంట డీసీపీ రాజేష్, అడిషనల్ డీసీపీ రాంకుమార్, ఏసీపీ శ్రీనివాస్‌రావు ఉన్నారు.

ఎస్‌బీఐను ఏర్పాటు చేయండి

జిన్నారం (పటాన్‌చెరు): జిన్నారంలో ఎస్‌బీఐ బ్యాంకును ఏర్పాటు చేయాలని మాజీ వార్డు సభ్యుడు శ్రీనివాస్ యాదవ్ అన్నారు. శనివారం ఆయన మాట్లాడుతూ.. మండలంలోని వినియోగదారులు లావాదేవీలకు బ్యాంకును ఏర్పాటు చేయాలని ప్రతిపాదన ఎప్పటినుంచో ఉందన్నారు. వ్యాపార లావాదేవీలు, రైతులకు సంబంధించిన లావాదేవీలు మండలంలో ఎక్కువగా కొనసాగుతాయని అధికారులు వీటన్నిటిని పరిశీలించి జిన్నారంలో బ్యాంక్ ఏర్పాటు దిశగా చర్యలు చేపట్టాలని కోరారు. బ్యాంకు ఏర్పాటుపై ఇప్పటికే పలుమార్లు విజ్ఞప్తులు చేశామన్నారు. మండలంలో ఎస్‌బీఐ బ్యాంకు లేనందున గుమ్మడిదల అన్నారం గండి మైసమ్మ ప్రాంతాలకు వెళ్లాల్సిన పరిస్థితి నెలకొందన్నారు.

లక్ష తమలపాకుల అర్చన



మూసాపేట: భరత్‌నగర్ కాలనీ హరిహర క్షేత్రంలో ఆదివారం దాసాంజనేయ స్వామికి లక్ష తమలపాకుల అర్చన ఘనంగా నిర్వహించారు. కార్తీక మాసోత్సవంలో భాగంగా ఉదయం నుంచి ఆలయంలో ప్రత్యేక పూజల అనంతరం ఆలయ అర్చకులు యోగానంద లక్ష్మీ నరసింహ స్వామి సమక్షంలో ఆంజనేయ స్వామికి లక్ష తమలపాకుల అర్చన, పూజలు ఘనంగా జరిగాయి. అదే విధంగా కార్తీక మాసం రెండవ సోమవారం సందర్భంగా ఉదయం 5 గంటల నుంచి శివాలయంలో ప్రత్యేక అభిషేకాలు, సామూహిక అభిషేకాలు నిర్వహించనున్నట్లు ఆలయ అర్చకులు కృష్ణ సూరి తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారి కృపకు పాత్రులు కాగలరని కోరారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు



గచ్చిబౌలి: వైట్‌ఫీల్డ్‌లోని ప్రభుపాద హిల్స్ విద్యుత్ ఫీడర్ పరిధి మరమ్మతుల కారణంగా సోమవారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఏఈ కిషోర్ తెలిపారు. ఉదయం 11 నుంచి సాయంత్రం 4 గంటల వరకు మారుతీనగర్, క్యామ్‌లెట్ లేఅవుట్, మసీదుబండ, లగ్జర్ అపార్ట్‌మెంట్స్, ప్రభుపాద టౌన్‌షిప్‌లలో విద్యుత్ ఉండదని ఆయన వివరించారు.

వేమన కాలనీ సబ్‌స్టేషన్ పరిధిలో...

చందానగర్: వేమన కాలనీ సబ్‌స్టేషన్ పరిధిలోని 11 కేవీ ఫీడర్ల పరిధిలో సోమవారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని ఏఈ శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు.

- సురక్ష ఫీడర్ పరిధిలో విద్యానగర్, సురక్ష కాలనీ, రాజేంద్రరెడ్డి కాలనీ, సుభోదయ కాలనీ, సత్య కాలనీ, అపర్ణ తదితర ఏరియాలలో ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 3.30 గంటల వరకు విద్యుత్ ఉండదన్నారు.

రామ్ నరేష్‌నగర్ ఫీడర్ పరిధిలో..

మియాపూర్: రామ్ నరేష్‌నగర్ ఫీడర్ పరిధిలోని పలు ప్రాంతాలలో సోమవారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని ఏఈతెలిపారు. ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 3.30 గంటల వరకు మెరీడియన్ ఎన్‌క్లేవ్, మోక్షజ్ఞ రాయల్ విల్లాస్, హైదర్‌నగర్ చెరువు కట్ట, రామ్ నరేష్ నగర్ కాలనీ, హైదర్‌నగర్ వాటర్ వర్క్స్, ఈవీ చార్జింగ్ స్టేషన్ ప్రాంతాల్లో విద్యుత్ ఉండదన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ పేదలకు వరం

పీఏసీ చైర్మన్, శేరిలింగంపల్లి ఆరెకపూడి గాంధీ


చెక్కులను అందిస్తున్న ఎమ్మెల్యే గాంధీ

గచ్చిబౌలి: పేద, మధ్య తరగతి ప్రజానీకానికి ఆర్థిక భరోసాగా ముఖ్య మంత్రి సహాయనిధి(సీఎంఆర్ఎఫ్) నిలుస్తోందని పీఏసీ చైర్మన్, శేరిలింగంపల్లి ఎమ్మెల్యే ఆరెకపూడిగాంధీ పేర్కొన్నారు. ఆదివారం ఆయన నివాసంలో సీఎంఆర్ఎఫ్ ఆరు మంది లబ్ధిదారుల కుటుంబసభ్యులకు రూ. 3.18 లక్షల చెక్కులను ఆయన చేతుల మీదుగా అందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ... ప్రజాక్షేమమే ప్రభుత్వ లక్ష్యంగా తెలంగాణ ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి పేదల పక్షపాతి అని ఆయన పేర్కొన్నారు. సీఎంఆర్ఎఫ్ నిరంతరం సేవలను అందిస్తూ ఆపదలో ఉన్నవారికి ఆపన్నహస్తం లా ఆదుకుంటుందన్నారు. అనారోగ్యానికి గురై ఆర్థిక స్తోమత లేక ఆస్పత్రిలో చికిత్స పొందిన నిరుపేదలు, అభాగ్యులఅకు అండగా సీఎం సహాయ నిధి ఆర్థిక భరోసాను కల్పిస్తోందని ఆయన గుర్తుచేశారు.పేద మధ్యతరగతి వారికి ఆస్పత్రిలో బిల్లులు కట్టలేని పరిస్థితిలో ఉన్న వారికి రాష్ట్ర ప్రభుత్వం అండగా నిలుస్తూ ఆర్థిక సహాయం అందిస్తుందన్నారు. అందులో భాగంగా శేరిలింగంపల్లి నియోజకవర్గంలోని ఎన్నో వందల కుటుంబాలకు సీఎంఆర్ఎఫ్ ద్వారా ఆదుకున్నామని ఆయన గుర్తు చేశారు. నాయకులు సంజీవరెడ్డి, దామోదర్‌రెడ్డి, మంత్రిప్రగడ సత్యనారాయణరావు తదితరులు పాల్గొన్నారు.

ముమ్మరంగా ఇంటింటి సర్వే

చందానగర్‌లో తనిఖీ చేసిన అబ్జర్వర్ మయాంక్ మిట్టల్ తనిఖీ


రెడ్డి కాలనీలో పరిశీలిస్తున్న మయాంక్ మిట్టల్, జెడ్‌సీ ఉపేందర్‌రెడ్డి, డీసీ మోహన్‌రెడ్డి


లక్ష్మీవిహార్ కాలనీలో..

చందానగర్: సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, కుల సర్వేలో భాగంగా ఆదివారం చందానగర్ సర్కిల్ పరిధిలో సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే ముమ్మరంగా సాగుతోంది. అందులో భాగంగా కార్పొరేటర్ మంజుల రఘునాథ్‌రెడ్డి కుటుంబ వివరాలను ఎన్యూమరేటర్లు సేకరించారు. శేరిలింగంపల్లి జోన్ అబ్జర్వర్ మయాంక్ మిట్టల్, జోనల్ కమిషనర్ ఉపేందర్‌రెడ్డి, డీసీ మోహన్‌రెడ్డిలు వివరాల సేకరణ తీరును పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... కులగణన సర్వేలో తప్పులు లేకుండా ఎన్యూమరేటర్లు సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, కులం ఇతరత్రా వివరాలు జాగ్రత్తగా మార్గదర్శక పుస్తకంలో సూచించిన ప్రకారం పొరపాట్లు లేకుండా నమోదు చేయాలన్నారు. రోజూ సంబంధిత సూపర్‌వైజర్లు ఎన్యూమరేటర్ల నమోదును క్షేత్ర స్థాయిలో తనిఖీలు నిర్వహించాలని ఆదేశించారు. ఎన్యూమరేటర్లకు తగు మార్గదర్శకత్వం చేయాలన్నారు. అనంతరం కార్పొరేటర్ మంజుల రఘునాథ్‌రెడ్డి మాట్లాడుతూ... సమగ్ర సర్వే పేద మధ్య తరగతి వారికి ఎంతో దోహదం చేస్తుందన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను అర్హులైన వారందరికీ అందించడానికి రాష్ట్ర ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని చేపట్టిందన్నారు. నిరుద్యోగులకు ఉద్యోగ ఉపాధి అవకాశాలు వస్తాయన్నారు. ప్రజలందరూ తమ ఇంటికి వచ్చిన ఎన్యూమరేటర్లకు, సూపర్‌వైజర్లకు సహకరించాలన్నారు. ప్రాజెక్టు అధికారి ఉషారాణి, ఏఎంసీ విజయ్‌కుమార్, కృష్ణ, కాంగ్రెస్ నాయకులు రఘునాథ్ రెడ్డి తదితరులు ఉన్నారు.

శేరిలింగంపల్లి సర్కిల్‌లో...

శేరిలింగంపల్లి: శేరిలింగంపల్లి సర్కిల్‌లో సమగ్ర కుటుంబ సర్వేను ఐఏఎస్ అధికారి మయాంక్ మిట్టల్ పరిశీలించారు. శనివారం లక్ష్మీవిహార్ ఫేజ్–2 కాలనీ, నల్లగండ్లలో ఎన్యూమరేటర్ చేస్తున్న సమగ్ర సర్వేను శేరిలింగంపల్లి జోనల్ కమిషనర్ ఉపేందర్‌రెడ్డి, డిప్యూటీ కమిషనర్ ముకుంద్‌రెడ్డిలతో కలిసి ఆయన పర్యవేక్షించారు. ఈ సందర్భంగా మయాంక్ మిట్టల్ మాట్లాడుతూ... కుటుంబ సర్వేలో వివరాలను సమగ్రంగా నమోదు చేయాలని, ఎలాంటి పొరపాట్లు తావులేకుండా, సయమం తీసుకోవాలన్నారు. ఏమైనా అర్థం కాకపోతే ఫోన్ చేసి తెలుసుకోవాలని ఎన్యూమరేటర్స్, సూపర్ వైజర్స్‌కు సూచించారు. ఏఎంసీ ప్రేమ్‌కుమార్, ట్యాక్స్ ఇన్‌స్పెక్టర్ దిలీప్ తదితరులు పాల్గొన్నారు.